

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

**హై ఆగ్ హమారే సీనేమే హం ఆగ్ సె ఖేల్తే ఆతా హై**

**టక్రాతే హై ఇస్ తాకత్ సె వో మిట్టీమే మిల్ జాతా హై**

'జిస్ దేశ్‌మే గంగా బహతీ హై' భారతీయ చలనచిత్రాలలో అపురూపమైన చిత్రం. మన సినీకళాకారులు సాధారణంగా ' సరైన కథ దొరకటంలేదు' అంటూంటారు. 'మంచి సినిమా తీయాలనే ఉంది. కానీ మంచి కథ దొరకటంలేదు' అన్న వ్యాఖ్యానాలు వింటూనే ఉంటాం. ఇవన్నీ ఉత్తిత్తిమాటలు. సినిమా ఎలా తీయాలో తెలిసిన వాడికి కథ అవసరంలేదు అని నిరూపిస్తుంది జిస్ దేశ్‌మె గంగా బహతీ హై సినిమా.

బందిపోటు దొంగలకు క్షమాభిక్ష ప్రసాదించి వారు జనజీవన స్రవంతిలో కలిసిపోయి మాములు మనుషుల్లా జీవించమని ప్రభుత్వం పిలుపునిచ్చింది. ఆ పిలుపు ఆధారంగా నిర్మించిన సినిమా 'జిస్ దేశ్‌మె గంగా బహతీ హై'. ముందుగా ఈ ఆలోచన చెప్పి, ఈ సినిమాకు సంగీత దర్శకత్వం వహించమంటే, 'దొంగల సినిమాలో సంగీతం ఏమిటి?' అన్నారు రాజ్‌కపూర్ రెగ్యులర్ సంగీత దర్శకులు శంకర్ జైకిషన్‌లు. వారిని ఒప్పించి పాటలు అవసరంలేదన్న సినిమాను పాటలమయం చేసి 'మ్యూజికల్ హిట్'గా నిలిపాడు రాజ్‌కపూర్. మొత్తం తొమ్మిదిపాటలు. ప్రతి ఒక్కటీ ఆణిముత్యం అనదగ్గరీతిలో ఉంటాయి. పాటలకోసం సినిమాలో సృజించిన సందర్భాలు సినిమా వేగాన్ని పెంచుతూ ఏ ఒక్క పాటకూడా అసందర్భం, అనవసరం అనిపించదు. అసలు పాటలు లేకపోతే 'జిస్ దేశ్‌మే గంగా బహతీ హై' అన్న సినిమాను ఊహించలేము. అంతగా అత్యద్భుతమైన రీతిలో పాటలను స్క్రిప్టులో భాగం చేశాడు రాజ్‌కపూర్. అలాంటి ఆణిముత్యమనదగిన పాటలన్నిటిలోకీ 'అత్యద్భుతం' అనదగ్గపాట 'హై ఆగ్ హమారే సీనేమే '

సినిమాలో సందర్భం తెలియకుండా కూడా సాహిత్యం, సంగీతం వంటివాటి ద్వారా ఈ పాటను విన్నవారు అతిగొప్ప పాటగా అంగీకరిస్తారు. కానీ సినిమాలో పాట సందర్భం తెలిస్తే పాట మరింతగా నచ్చటమే కాదు సినీ కళాకారుల ప్రతిభ కూడా తెలుస్తుంది. ఆశ్చర్యం కలుగుతుంది. గర్వం కలుగుతుంది.

రాజు అమాయకుడు. అనుకోని పరిస్థితులలో దొంగల మధ్య వచ్చిపడతాడు. దొంగలు అతడిని పోలీసు గూఢచారి అనుకుంటారు. కానీ రాజు కు అలాంటివేమీ తెలియదు. తెలిసిందల్లా డఫ్లీ వాయించటం, పాటలు పాడటటం. అంతే. అతడు దొంగల గూడెంలో ఓ అమ్మాయి ప్రేమలో పడతాడు. అది అతనికి తెలియదు. ఆ అమ్మాయి కూడా అతని ప్రేమలో పడుతుంది. ఆమె గడుసుది. ఆ విషయం ఆమె బయటపడనివ్వదు. కానీ రాజును కలుస్తుంటుంది. ఏడిపిస్తూంటుంది. అయితే దొంగల నాయకుడికి మొదటినుంచీ రాజు అంటే కోపంగా ఉంటుంది. నాయిక రాజుతో సన్నిహితంగా ఉండటం అగ్నికి ఆజ్యం పోసినట్టవుతుంది. కోపానికి అసూయ తోడవుతుంది. దాంతో అవకాశం దొరికితే రాజును తక్కువ చేయాలను చులకన చేయాలని ప్రయత్నిస్తూంటాడు. ఓ రోజు అందరూ వాయిద్యాలు వాయిస్తూ నృత్యాలు చేస్తున్నప్పుడు దొంగల నాయకుడు ఢోలక్ వాయిస్తూ తనతో పోటీపడమని రాజును పిలుస్తాడు. దొంగల నాయకుడి ఢోలక్‌కు జవాబు రాజు డఫ్లీతో ఇస్తూంటాడు. ఇది పాట ఆరంభానికి దారితీస్తుంది.

ఇక్కడ సందర్భం కుదిరింది. దొంగల నాయకుడు అహంకారి. క్రూరుడు. భుజబలం ఉన్నవాడు. మనుషులను దోచటం, చంపటం అతడికి అలవాటు. అతడితో పోలిస్తే హీరో బలహీనుడు. తుపాకీ పట్టటం రాదు. హింసకు వ్యతిరేకి. మంచితనానికి మారుపేరు. అమాయకుడు. దొంగల నాయకుడి ఉద్దేశ్యం రాజును తక్కువ చేయాలని అవమానించాలని. అతడిని తక్కువ చేయటంద్వారా నాయికకు తన గొప్పతనం, నాయకుడి చేతకాని తనం ప్రదర్శించాలన్నది అతడి లక్ష్యం. అందుకే తాను ఢోలక్ వాయిస్తూ డప్లీ పోటీగా వాయించమని హీరోను పిలుస్తాడు. మన సినిమాలలో ఇలాంటి సందర్భాలు అరుదుగా ఉంటాయి. ఉన్నా ఊహకు అందేరీతిలో ఉంటాయి. నాయకుడిని పాడమని బలవంతం చేస్తారు. నాయకుడు అద్భుతంగా పాడేస్తాడు. నాయిక శాస్త్రీయ నృత్యం చేస్తుంది. ఆమెకు పోటీగా ఓ పాత్ర పాశ్చాత్య నృత్యం చేస్తూ పిలుస్తుంది. నాయిక గెలుస్తుంది. లేకపోతే నాయికా నాయకుల నడుమ పోటీ జరుగుతుంది. నాయకుడు గెలుస్తాడు. ఇలాంటి సందర్భాలు అనేకం. ఆ సమయంలో పాటలు సందర్భోచితంగా ఉంటాయి. కానీ 'జిస్ దేశ్‌మే గంగా బహతీ హై' సినిమాలో ప్రతినాయకుడు, నాయకుడు పోటీపడే ఈ సందర్భంలోని పాట అపురూపమైనది. పాట చిత్రీకరణ అత్యద్భుతమైనది. సినీ నిర్మాణంపట్ల ఆసక్తి ఉన్నవారికి స్క్రిప్టులో పాటకు సందర్భాన్ని సృజించటమేకాదు, ఆ పాటను సినీ సందర్భ పరిధిదాటి సార్వజనీనంగా ఎదిగింపచేయటానికి పాఠ్యపుస్తకంలాంటిది ఈ పాట.

ఢోలు, డప్లీల పోటీ అయిపోయింది. దొంగలనాయకుడికి దీటుగా డప్లీ వాయించాడు రాజు. తన ఆధిక్యాన్ని నిరూపించుకోవాలన్న దొంగలనాయకుడి పథకం పారలేదు. దాంతో తన ఆధిక్యాన్ని నిరూపించుకునే వీలున్న బలప్రదర్శన ఆరంభించాడు.

గుర్రం ఎక్కి వచ్చాడు. పాట అందుకున్నాడు.

ఇక్కడ మామూలు గేయరచయితలు ఒక రకంగా రాస్తారు. కానీ శైలేంద్రలాంటి గేయ రచయిత మాత్రమే పాటకు సార్వజనీనతను ఆపాదిస్తు, జీవితసత్యాలను తెలుపుతూ, పాటను సందర్భ పరిధిలో ఒదిగింపచేస్తూ, పాత్రల వ్యక్తిత్వాలను ప్రస్ఫుటం చేసే గీతాన్ని రచిస్తాడు.

'నా హృదయంలో అగ్ని ఉంది. నిప్పుతో చెలగాటమాడుతుంటాం. మా శక్తితో తలపడినవాడు మట్టిలో కలసిపోతాడు' అంటాడు దొంగల నాయకుడు.

దొంగల నాయకుడికి బలప్రదర్శన ఒక్కటే తెలుసు. 'శక్తి' ప్రదర్శన మాత్రమే తెలుసు. దొంగతనాలకు కారణం సమాజంలో తమకి జరిగిన అన్యాయం. అది వాళ్ల గుండెల్లో రగిలే అగ్ని. నిప్పుతో చెలగాటమాడటం అంటే టేకింగ్ రిస్క్స్. ఇక్కడ హీరో దొంగలనాయకుడితో తలపడుతున్నాడు. దొంగతనాలు వద్దంటున్నాడు. జనజీవన స్రవంతిలో కలిసిపొమ్మంటున్నాడు. అన్నిటికన్నా ప్రాధాన్యం నాయికను ఆకర్షిస్తున్నాడు. కాబట్టి, తన దారికి అడ్డువస్తే మట్టిలో కలిసిపోతావన్న బెదిరింపుకూడా ఉంది.

ఇది వినగానే దొంగలనాయకుడు ఈ సవాల్‌కి, బెదిరింపుకీ అమాయకుడయిన నాయకుడు సమాధానం ఏమిస్తాడో అన్న కుతూహలం కలుగుతుంది.

**తుం సే తో పతంగ అచ్ఛాహై జో హస్తే హువే జల్ జాతా హై**

**వో ప్యార్‌మె మిట్ హో జాతా హై, పర్ నాం అమర్ కర్ జాతాహై.**

'నీకన్నా దీపం పురుగులు మంచివి, అవి నవ్వుతూ కాలిపోతాయి. ప్రేమలో మరణిస్తాయి కానీ చిరంజీవులుగా శాశ్వతంగా వాటి పేరు నిలిచిపోతుంది' అంటాడు హీరో.

'దొంగల నాయకుడి గుండెలో మంట, నిప్పుతో ఆడేది చెలగటం' అన్నాడు. కాబట్టి హీరో 'మంట'లో స్వచ్ఛందంగ కాలిపోయే దీపం పురుగు ప్రస్తావన తీసుకువచ్చాడు. ఫార్సి కవిత్వాలలో 'షమ్మ, పర్వానా'ల ప్రతీక అమరప్రేమకు నిదర్శనం. దీపాన్ని ప్రేమించిన దీపం పురుగు, దీపంలో పడితే మాడి మసైపోతానని తెలిసికూడా దీపంలోకి ఉరుకుతుంది. మరణిస్తుంది. కానీ ప్రేమకోసం ప్రాణాన్ని త్యాగం చేసిన దానిగా

దాని పేరు చిరంజీవిగా మిగులుతుంది. అంటే కోపంలో జరిపే హింస వ్యర్థం. ఎంత బలం ఉన్నా వ్యర్థం. ప్రేమలో మరణించినా ఒక సార్థకత లభిస్తుంది. నిప్పులతో ఆడటం, మట్టిలో కలిపేయటం దొంగల నాయకుడి వ్యక్తిత్వం. ప్రేమలో మరణించటం నాయకుడి వ్యక్తిత్వం. ప్రేమ అతడి దారి. ఇదే సినిమాలో మరో సందర్భంలో ఇదే విషయాన్ని మరింత స్పష్టంగా చెప్తాడు గేయ రచయిత

**ప్యార్ కర్ లే నైతో ఫాసీ చఢ్ జాయేగా**

**యార్ కర్‌లే నైతో యూహీ మర్ జాయెగా..**

ప్రేమించు లేకపోతే ఉరి తప్పదు. స్నేహం చెయ్యి. లేకపోతే వ్యర్థంగా మరణిస్తావు ఇలా సినిమా కథాసారాన్ని పట్టుకుని సినిమా ఆత్మను తన గేయాల్లో ప్రతిబింబించటం శైలేంద్ర ప్రత్యేకత.

అయితే ఈ పాట చిత్రీకరణలో, పాటను రూపొందించిన విధానంలో ఒక చమత్కారం ఉంది. దొంగల నాయకుడు పాడినప్పుడు దొంగలంతా 'హాయ్ హాయ్' అని అరుస్తారు. అదే హీరో పాడినప్పుడు ఎవ్వరూ స్పందించారు. కేవలం నాయిక 'హాయ్ హాయ్ హాయ్' అంటుంది. అంటే దొంగలంతా ఒకవైపు, నాయకుడు, నాయిక ఒకవైపు అన్నమాట.

**హం భీ హై తుం భీ హో దోనో హై ఆమ్నే సామ్నే**

**దేఖ్‌లో క్యా అసర్ కర్ దియా ప్యార్ కె నామ్నే.**

ఇది అందరూ పాడతారు. మేమూ ఉన్నాము. నువ్వున్నావు. ఇద్దరం ఎదురూ బదురుగా ఉన్నాము. ప్రేమ అన్న పేరు ఎలాంటి ప్రభావం చూపించిందో చూడు.

**హం గాతె గర్ జాతే సాగర్ హై కొయీ హం కో బాంధ్ నహీ పాయా '**

**హొయ్ హం మౌజ్ మె జబ్ భీ లహేరాయా సారా జగ్ డర్ సే ధరాయా!**

మళ్లీ తన 'శక్తి' గురించి మాట్లాడుతున్నాడు దొంగల నాయకుడు. నేను పాడుతూ, గర్జిస్తూ ప్రవహించే సాగరాన్ని, నన్ను ఎవ్వరూ బంధించలేరు. నేను ఎప్పుడయితే పరవళ్లు తొక్కానో అప్పుడు ప్రపంచం మొత్తం భయంతో కంపించి పోతుంది.

**హం చోటీసీ జో బూంద్ సహీ హై సీప్ నె జిస్ కో అప్నాయా**

**ఖారాపానీ కొయీ పీ నసాకా, ఎక్ ప్యార్ క మోతీ కామాయా!**

వింటూంటేనే హృదయ లోలోతుల్లోంచి 'వహ్వా' అన్న శబ్దం వెలువడుతుంది. దొంగల నాయకుడు తాను ఎవ్వరూ బంధించలేని, అందరినీ ముంచెత్తే సముద్రంలాంటి వాడినన్నాడు. దానికి అదే భాషలో, అదే ప్రతీకతో సమాధానం ఇచ్చి తిప్పికొడుతున్నాడు నాయకుడు.

నేను ఒక్క చిన్న నీటి బిందువునే కానీ, ముత్యం చిప్ప స్వీకరించిన నీటి బిందువును. ఉప్పు నీరు ఎవ్వరూ తాగలేరు కానీ ప్రేమ ముత్యం ప్రపంచానికి పనికి వస్తుంది. సాగరమైనంత మాత్రాన ఎవ్వరికీ ఉపయోగపడకపోతే లాభం లేదు. నీటి చుక్క అయినా ముత్యం అయితే అందరికీ ఉపయోగపడుతుంది. నువ్వు పనికిరాని సాగరానివి, నేను ముత్యంలాంటి నీటి చుక్కను అంటున్నాడు హీరో.

సినిమా పాటల్లో ఎన్నెన్నో వాగ్యుద్ధాలు చూసి ఉంటాం. కానీ ఇలాంటి సాహిత్యపరమూ, ఔచిత్యవంతమూ, ఆలోచనాత్మకమూ, ఉపయోగకారకమూ, ప్రేరణాత్మకమయిన సంవాదం మాత్రం మరొకటిలేదు.

దొంగల నాయకుడిని తేరుకోలేని విధంగా నాయకుడు దెబ్బ కొట్టాడని దొంగల నాయకుడి ప్రేయసి గ్రహిస్తుంది. ఆమె రంగంలోకి దూకుతుంది.

**కిస్ ఫూల్ పె దునియా మర్తీ హై కౌన్ సఫల్ సబ్సే మీ ఠా**

**నైనోసె నైనా టక్రాయే తో కౌన్ హార్ ఔర్ కౌన్ జీతా**

ఏ పూల కోసం ప్రపంచం ప్రాణాలిస్తుంది? ఏ ఫలం అన్నిటికన్నా తీయనైనది. కళ్లు కళ్లతో కలసినప్పుడు ఎవరు గెలిచారు? ఓటమి ఎవరిది?'

దొంగలనాయకుడి ప్రేయసికి తెలుసు, దొంగల నాయకుడి కన్ను నాయికమీద ఉందని. నాయకుడిపై అతడికి అందుకే కోపమని. దాన్ని అత్యంత నర్మగర్భిత్మగా తన ప్రశ్నలో పొందుపరచింది.

దానికి నాయకుడి సమాధానం అంతే గడుసుగా ఉంటుంది.

**యే దిల్ కా కమల్ సబ్సే సుందర్, మెహనత్ కా ఫల్ సబ్ సే మీఠా**

**ఇస్ ప్యార్ కె బాజీ మే హస్కర్ జో దిల్ హారా వో సబ్ జీతా.**

హృదయ కమలం అన్నిపూలకన్నా సుందరమైనది. కష్టఫలం అన్ని ఫలాలకన్నా తీయనిది. ప్రేమపోటీలో నవ్వుతూ హృదయాన్ని ఓడిపోయినవాడే అన్నిటినీ గెలిచిన విజేత. అద్భుతం.

ప్రతివాదన లేని సమాధానం. ఒక్కదెబ్బతో అటు దొంగలనాయకుడిని కొట్టాడు. ఇటు అతడి ప్రేయసికి ప్రేమలో సర్వం కోల్పోవటమే గొప్ప విజయం అని చెప్పాడు. అందరి హృదయాలను గెలుచుకున్నాడు.

తమ ఓటమి సంపూర్ణం అని గ్రహించాడు దొంగల నాయకుడు. వ్యక్తిగత దూషణకు దిగాడు.

ఇది మానవ మనస్థత్వం

ఆరంభంలో తార్కికంగా వాదన ఆరంభిస్తాడు. కానీ వాదనలో గెలవలేను అనిపించినప్పుడు అహంకారం అధికంగా కలవాడు, ఓటమిని ఒప్పుకోలేక వ్యక్తిగత దూషణకు దిగుతాడు. దౌర్జన్యం ఆరంభిస్తాడు.

**ఇత్నా స జిగర్, ఇత్నీ స హై దిల్ క్యా బాత్ బడీ కర్నే ఆయా**

**క్యా ఫైదా హోగి ఆగ్ అగర్ పద్దల్ సెన పద్దర్ టక్రాయా...**

పిడికిలంత హృదయం, ఇంకా చిన్న గుండె, వాటిలో ఏదో సాధించాలని వచ్చాడు. రాయి రాయి రాసుకోకపోతే నిప్పు పుడుతుందా? అంటే ఘర్షణ లేనిదే ఉష్ణం జనిస్తుందా? జనించదు. కాబట్టి 'హింస' తప్పనిసరి. అది ప్రాకృతిక సూత్రం అంటున్నాడు. అంటే నువ్వేం సాధించాలని వచ్చావు? చిన్న పిట్టంత మనిషివి. పో అంటున్నాడు.

**నన్ హాసా దిల్ యె ఆఖో మె నహోతో పల్మె అంధేరా హోజాయే** అంటాడు హీరో.

'కళ్లల్లో ఈ చిన్న హృదయం లేకపోతే ప్రపంచం క్షణంలో చీకటి అయిపోతుంది' అంటున్నాడు. అద్భుతం!

'కళ్లల్లో హృదయం ఉండటం ఏమిటి?' అన్న ప్రశ్న వస్తుంది.

అత్యంత తాత్వికమైన సమాధానం ఇది.

మనిషి ఆత్మ శరీరంలో ఎక్కడ ఉంటుంది?

కళ్లల్లో ఉంటుంది. అదే వెలుగై మనకు దారి చూపిస్తుంది. చనిపోయిన వారి కళ్లల్లో ఎంత వెలుగు ప్రసరింపచేసినా లాభంలేదు.

కళ్లల్లో హృదయం ఉండటం మరో అర్థాన్నిస్తుంది.

హృదయం మన ఆశలకు, కలలకు నిలయం. కళ్లల్లో ఆ ఆశ, దీక్ష, లక్ష్యం, పట్టుదలలు ఉంటే మనిషి జీవితానికి అర్థం ఉంటుంది. అతని జీవన ప్రయాణానికి ఒక గమ్యం, లక్ష్యం, దిశ ఏర్పడతాయి. అది లేకపోతే అతని బ్రతుకు అర్థవిహీనం. వ్యర్థం. 'ఇత్నా స జిగర్, ఇత్నాస దిల్ క్యా బాత్ బడి కర్నే ఆయా' అన్న దొంగల నాయకుడి ఈసడింపుకు దీటైన సమాధానం ఇది.

తన జీవితం లక్ష్యం లేనిది కాదు. తన ప్రయాణం గమ్యం లేని ప్రయాణం కాదు. తన బ్రతుకు అంధకారం కాదు.

గమనిస్తే నాయకుడు పెద్ద ప్రతీకలు వాడాడు సాగరం, అగ్ని, మట్టిలో కలిపేస్తా వంటివి. నాయకుడు నీటి చుక్క, దీపం పురుగువంటి ప్రతీకలు వాడాడు. కానీ 'డేవిడ్ అండ్ గోవియల్' కథలోలా చిన్నవాడు బలవంతుడిపై విజయం సాధించాడు, చిన్న చిన్న ప్రతీకలతో. 'బలవంతమైన సర్పము చలిచీమల చేత చిక్కి చచ్చినట్టు' దొంగల నాయకుడు చివరికి ఓటమి ఒప్పుకుని జనజీవన స్రవంతిలో భాగం అవటానికి ఇది సూచన. దౌర్జన్యంపై, అహంకారంపై, శారీరక బలంపై ప్రేమ విజయం సాధించటాన్ని ఇది ప్రతిబింబిస్తుంది.

అయితే నాయకుడితో పోటీగా దొంగల నాయకుడి ప్రేయసి రంగంలో దిగింది. కాబట్టి నాయకుడికి సమర్థనగా, నాయిక రంగ ప్రవేశం చేస్తుంది. నాయకుడి పాటను పూర్తి చేస్తుంది.

**'ఇత్నా సాదిల్ తు దేదే అగర్ సారా జాగ్ తేరా హోజాయే'** అంటుంది.

నాయకుడు కళ్లల్లో హృదయంలాంటి ఆత్మ గురించి ప్రస్తావించాడు. నాయిక 'ఇత్నా సా దిల్' అని దొంగల నాయకుడు ఈసడించిన చిన్న హృదయాన్ని ప్రస్తావించి, ఆ హృదయం ఇస్తే ప్రపంచం అంతా నీదవుతుంది అంటుంది. ప్రేమ విజయాన్ని ప్రకటిస్తుంది. నాయకుడి విజయం సంపూర్ణమవుతుంది. ఇంకా పాట ఉంటుంది కానీ అది నాయికా నాయకులు ప్రేమ యుగళగీతంలా ఉంటుంది. గేయ రచయిత ప్రతిభ నాయకుడికీ, దొంగల నాయకుడికీ నడుమ జరిగిన సంవాదంలో ప్రస్ఫుటమవుతుంది.

దర్శకుడి ప్రతిభ పాట చిత్రీకరణలో స్పష్టంగా తెలుస్తుంది.

కెమేరా కోణాలు, క్లోజప్పులు, నృత్యాలు ఒకటేమిటి పాట మనోఫలకంపై ప్రతిష్ఠితమవుతుంది. ఇక బాణీ గురించి చెప్పటానికి మాటలు సరిపోవు.

శంకర్ జై కిషన్‌లు భైరవీ రాగంతో చేసినన్ని ప్రయోగాలు మరే సంగీత దర్శకుడు చేయలేదనటం అనృతం కాదు. భైరవికి సాధారణంగా అందరూ నౌషాద్ పేరు చెప్తారు. కానీ నౌషాద్ ప్రయోగాలు సాంప్రదాయ బద్ధంగా ఉంటాయి. వారి తొలి చిత్రం 'బర్సాత్'లోని తొమ్మిది పాటలలో ఆరు పాటలను భైరవి రాగంలో రూపొందించారు. అంతేకాదు హిందూస్తానీ భైరవి రాగాన్నీ దానికి సమానరాగమైన కర్ణాటక తోడి రాగాన్ని కలిపి పాటలు రూపొందించారు. భైరవి రాగాన్ని పాశ్చాత్య లయలతో జతపరచి 'చాహె కోయి ముఝె జంగ్లీ కహే' లాంటి వేగవంతమైన పాటను సృజించారు. అంతేకాదు 'సన్యాసి ' సినిమాలోని పాటలన్నీ నేపథ్య సంగీతంతో సహా భైరవి రాగంలోనే రూపొందించారు. 'తెరాజునా' (అనాడి) అనే విషాద గీతం 'బోల్ రాధ బోల్ (సంగం) అనే చిలిపి గీతం భైరవి రాగ ఆధారిత గీతాలే. అంటే ఒక రకంగా భైరవి రాగంతో వారు సరస్వతీదేవి ఒడిలో పిల్లవాడు ఆడినట్టు ఆడుకున్నారన్నమాట.

'హై ఆగ్ హమారీ సీనేమో' పాట పలు మెలికలు తిరుగుతుంది. ఆరంభ సంగీతం, ఇంటర్ల్యూడ్ సంగీతం అత్యద్భుతంగా ఉంటుంది. నృత్యానికి అత్యంత అనువు. ముఖ్యంగా వాద సంవాద గీతం ప్రేమ యుగళగీతంగా మారినప్పుడు మారిన వాయిద్యాల కదలిక, మారిన బాణీ అత్యద్భుతం. నిజానికి రెండు వేర్వేరు గీతాలను గుదిగుచ్చి ఒక గీతంగా మలిచారు. ఎక్కడా తేడా తెలియకుండా పాట నీరు పల్లానికి ప్రవహించినట్టు ప్రవహిస్తుంది. గతంలోనూ వారు 'బర్సాత్' లో 'పత్లికమర్ హై', ఆవారాలో 'కలపాట' శ్రీ 420లో 'ముడ్ ముడ్ కే న దేఖ్' వంటి పాటలలో వేర్వేరు బాణీల పాటలను ఎలాంటి ఇబ్బంది కలగని రీతిలో కలిపి ఒకే పాటగా మలచారు. వారి అత్యద్భుతమైన గీత సృజన ప్రతిభకు ఇవి తిరుగులేని నిదర్శనాలు. వాటిలో తలమానికం అనదగ్గ పాట ఇది. వాయిద్యాల వాడకంలోనూ ఔచిత్యం ప్రదర్శించారు.

'హై ఆగ్ హమారే సీనేమే' పాట వింటూంటే అత్యంత ఆశ్చర్యం కలుగుతుంది. ఎంత గొప్ప కళాకారులు వారు. ఓ వైపు పాట సాహిత్యం పరమాద్భుతం. ఎంతో లోతైనది. మరోవైపు పాట, బాణీ, వాయిద్యాల మ్రోత పాటను రూపొందించిన తీరు దివ్యం. ఇలాంటి పాట మరొకటి లేదనిపిస్తుంది. పాట చిత్రీకరణ పాట ప్రభావాన్ని ఇనుమడింపచేస్తుంది. ఈ రకంగా అన్ని రకాలుగా అత్యద్భుతమైన కళాప్రదర్శనకు ఆలవాలం ఈ పాట.

ఇలాంటి పాటలు వింటూంటే, చూస్తూంటే ఈ ప్రపంచంలో ఇంకా ఏమీ అవసరం లేదనిపిస్తుంది. సినీ పరిధి దాటి ఎదిగిన ఈ పాటలు సినిమా చూస్తూ ఆనందిస్తాం. కేవలం పాటను చూస్తూ, వింటూ ఆనందిస్తాం. ఇలాంటి కళాకారుల అత్యద్భుతమైన ప్రదర్శనలే రొటీన్ జీవితంలో కొంతకాలమయినా అలౌకిక ఆనందాన్ని అనుభవానికి తెస్తాయి. అందుకే ఈ పాట సృజించి దాదాపుగా అరవై ఏళ్లు గడచినా పాట తరతరాలుగా అలరిస్తూనే వస్తోంది. మనిషి మనస్సుల్లో సున్నిత భావనలున్నంత కాలం అలరిస్తూంటుంది. ఆలోచింపచేస్తూంటుంది. ఏదో ఒక తరంలోని కార్యశూరుడిని ప్రభావితం చేస్తుంది. ఉత్తమ కళాసృష్టికి ప్రేరణ నిస్తుంది.

(మరిన్ని పాటలు వచ్చే నెలలో)

Post your comments